Follow: @ANNTELUGU

REGISTERED NUMBER
APTEL/2014/58382

27-12-2025

ANN తెలుగు

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 3 పేజీలు-04 వెల-రూ.6

PUBLISHED FROM TIRUPATI | HYDERABAD శనివారం WWW.EPAPER.MAHAADAILY.COM

## మావోయిస్టులకు మరణశాసనం రాసిన 2025

### ఉనికి నిలబెట్టుకోవడం ఇక అసాధ్యమే
### దెబ్బ మీద దెబ్బతో విలవిలలాడిన ఉద్యమం



**హైదరాబాద్, మహా :** 2025 సంవత్సరం భారత అంతర్గత భద్రతా చరిత్రలో, ముఖ్యంగా మావోయిస్టు వ్యతిరేక పోరాటంలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. దశాబ్దాలుగా ఎర్రజెండా నీడన సాగుతున్న సాయుధ పోరాటం ఈ ఏడాది కోలుకోలేని దెబ్బతిన్నది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న "మావోయిస్టు రహిత భారత్ లక్ష్యం దిశగా బలగాలు జరిపిన మెరుపు దాడులతో అడవులు అట్టుడికిపోయాయి.

**2025 మావోయిస్టుల అడవి సామ్రాజ్యానికి అస్తమయం**

2025 సంవత్సరం మావోయిస్టుల పాలిట మృత్యువు గా మారింది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా , ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో భద్రతా బలగాలు అప్రతిహత విజయాలను సాధించాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కేవలం ఒక్క ఏడాదే 200 మందికి పైగా మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో మరణించడం ఈ ఏడాది ప్రత్యేకత. మిగతా 2లో

**టాప్ న్యూస్**

## ఢిల్లీకి సీఎం రేవంత్



- నేడు సిడబ్ల్యుసి కీలక భేటీ
- నామినేటెడ్ పదవులపై చర్చించే అవకాశం

02

## గ్రేటర్ విజయవాడ



- కసరత్తు షురూ
- 75 గ్రామాలు విలీనం

02

## ఓటీటీకి వచ్చేసిన కీర్తి సురేశ్ మూవీ



- రివాల్వర్ రీటా స్ట్రీమింగ్

02



## రైతు భరోసా ఆగదు

- అసత్య ప్రచారాలు నమ్మొద్దు
- అసలైన సాగుదారులకే రైతు భరోసా!
- శాటిలైట్ నిఘాలో రియల్ ఎస్టేట్ వెంచర్లు
- వాణిజ్య భూములకు సాయం బంద్
- స్పష్టం చేసిన సర్కార్


**హైదరాబాద్, మహా:**

రాష్ట్రంలో రైతు భరోసా పథకాన్ని నిలిపివేస్తున్నారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని తెలంగాణ ప్రభుత్వం కుండబద్దలు కొట్టింది. ఈ పథకంపై వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారమని ఫ్యాక్ట్ చెక్ విభాగం వెల్లడించింది. సుమారు 65 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుస్తున్న ఈ పథకాన్ని ప్రభుత్వం కొనసాగిస్తుందని, అయితే ప్రజా ధనం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు మాత్రమే ప్రస్తుతం క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతోందని వివరించింది. మిగతా 2లో

# మెగా సిటీగా హైదరాబాద్

## గ్రేటర్‌పై సీఎం రేవంత్ గ్రాండ్ విజన్

- సమర్థ ఐఎఎస్‌లతో జోన్ వ్యవస్థ పటిష్టం
- త్వరలో జీహెచ్ఎంసికి కొత్త బాస్.. సీనియర్ ఐఎఎస్ కు బాధ్యతలు
- 2026లో ఎన్నికలు నిర్వహించాలని డిసైడ్
- దేశంలోనే అతిపెద్ద నగరంగా హైదరాబాద్ మెగా సిటీ
- సీఎం ఆదేశాలతో జోనల్ కమిషనర్లుగా బాధ్యతలు చేపట్టిన ఐఎఎస్ లు
- 12 జోన్లు.. 60 సర్కిళ్ళతో పబ్లిక్ హ్యాపీ




### దేశంలోనే మెగాసిటీ

**27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసిలో విలీనం చేయడంతో హైదరాబాద్ ఒక మెగా సిటీగా అవతరించిందని జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. ఈ విలీనంతో నగర విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని ఆయన చెప్పారు. గతంలో 650 చదరపు కిలోమీటర్లుగా ఉన్న జీహెచ్ఎంసి పరిధి ఇప్పుడు 2,053 చదరపు కిలోమీటర్లకు విస్తరించిందన్నారు. విస్తరించిన పరిపాలనా పరిధిని సమర్థవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుందని కమిషనర్ వివరించారు.**

**హైదరాబాద్ -మహా**

దేశంలోనే అతిపెద్ద మెగా సిటీగా హైదరాబాద్ వేగంగా రూపాంతరం చెందుతోంది. 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసిలో విలీనం చేయడంతో నగరం విస్తీర్ణం, పరిపాలనా పరిధి, అభివృద్ధి అవకాశాలు అన్నీ కొత్త స్థాయికి చేరాయి. ప్రస్తుతం జీహెచ్ఎంసి పరిధి 2,053 చదరపు కిలోమీటర్లకు విస్తరించడంతో హైదరాబాద్ దేశంలోనే అతి పెద్ద నగరంగా రికార్డుల్లో నిలిచింది. ఈ మెగా సిటీ అభివృద్ధికి ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి భారీ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. “గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ సమగ్ర అభివృద్ధే లక్ష్యం” అనే నినాదంతో మౌలిక వసతులు, పట్టణ ప్రణాళిక, పౌర సేవల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని సీఎం పట్టుదలగా ఉన్నారు. క్యూర్ పేరుతో మెగాసిటీని గ్రాండ్ విజన్ తో పరుగులు పెట్టించేందుకు సీఎం డిసైడ్ అయ్యారు. ప్రస్తుతం జీహెచ్ఎంసికి 2012 బ్యాచ్ ఐఎస్ కమిషనర్ గా ఉండగా, త్వరలో స్పెషల్ సీఎస్ స్థాయి సీనియర్ అధికారిని కమిషనర్ గా నియమించే అవకాశాలున్నాయి.

**జోన్ వ్యవస్థ పటిష్టం – సమర్థ ఐఏఎస్‌లకు బాధ్యతలు**

విస్తరించిన నగరాన్ని సమర్థంగా పాలించేందుకు జీహెచ్ ఎంసిని 12 జోన్లు, 60 సర్కిళ్లు ఏర్పాటు చేశారు. సీఎం ఆదేశాలతో ప్రతి జోన్‌కు అనుభవజ్ఞులైన, సమర్థవంతమైన ఐఏఎస్ అధికారులను జోనల్ కమిషనర్లుగా నియమించారు. మిగతా 2లో



## కేసీఆర్‌ను అసెంబ్లీకి రప్పిస్తున్న సీఎం

### విమర్శలు పెరగడంతో.. అసెంబ్లీకి హాజరుకావాలని కేసీఆర్ యోచన

ఈనెల 29న హాజరయ్యే అవకాశం.. మూడు జిల్లాల నేతలతో కేసీఆర్ సమావేశం

అసెంబ్లీ తర్వాత సభలు నిర్వహించాలని నిర్ణయం

**హైదరాబాద్, మహా:** దమ్ముంటే అసెంబ్లీకి రా అంటూ తరచూ సీఎంతో సహా కాంగ్రెస్ నేతలు కేసీఆర్ కు సవాళ్ళు విసరడం, ప్రజల్లో కూడా కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకాకపోవడంపై చర్చ జరుగుతుండడంతో ఈనెల 29న మొదలయ్యే అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావాలని కేసీఆర్ భావిస్తున్నారు. కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లో లేదు అని సీఎం రేవంత్ ప్రకటించిన మరునాడే తెలంగాణభవన్ లో మీటింగ్ కు వస్తానని ప్రకటించిన కేసీఆర్.. ఇపుడు కొడంగల్ నియోజకవర్గ సభలో రేవంత్ సవాళ్ళు, కేసీఆర్ ప్రెస్ మీట్ పై సీఎం సంచలన కామెంట్స్ నేపథ్యంలో అసెంబ్లీకి రావాలని కేసీఆర్ డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. ఈ మేరకు నేతలకు కూడా సంకేతాలిచ్చినట్లు తెలుస్తోంది.

**కాంగ్రెస్ పై కేసీఆర్ ధ్వజం**

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా బీఆర్ఎస్ మరోమారు ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు సిద్ధమైంది. ఎర్రవెల్లిలోని తన ఫామ్‌హౌస్‌లో పార్టీ ముఖ్య నేతలతో నిర్వహించిన కీలక మిగతా 2లో



ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ స్థలాన్ని

## పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

### రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రాజెక్టుకు పూర్తి సహకారం

**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ జిల్లా సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులను త్వరలోనే పట్టాలెక్కిస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం ఆయన పట్టణ పరిధిలోని ఎయిర్‌పోర్ట్ మైదానాన్ని సందర్శించి, విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించిన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ, నిర్మాణ స్థలం యొక్క మ్యాపింగ్, ఇతర సాంకేతిక అంశాలను అధికారుల నుండి అడిగి తెలుసుకున్నారు. ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు సంబంధించిన భూమి యొక్క సరిహద్దులు, అందుబాటులో మిగతా 2లో

వేములవాడ రాజన్న క్షేత్రానికి

## పోటెత్తిన భక్తులు..



- దర్శనానికి 5 గంటల సమయం
- రాజన్న సన్నిధిలో కోడె మొక్కుల కోలాహలం
- పోలీసుల భారీ బందోబస్తు

**వేములవాడ,మహా:** రాజన్న క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. ప్రముఖ శైవక్షేత్రమైన వేములవాడ భీమేశ్వర స్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. మేడారం సమ్మక్కసారలమ్మ జాతరకు వెళ్లే ముందు వేములవాడ రాజన్నకు కోడె మొక్కులతో పాటు వివిధ ఆర్జిత సేవలు చెల్లించుకోవడం భక్తులకు అనాదిగా వస్తున్న ఆనవాయితీ. ఈ నేపథ్యంలోనే జాతర సమయం దగ్గరపడుతుండటంతో రాజన్న సన్నిధికి భక్తుల రాక ఒక్కసారిగా పెరిగింది. ప్రస్తుతం వరుస సెలవులు రావడంతో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా, పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకుని, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం క్షేత్రంలోని బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని బోనాలు, పట్నం మొక్కులు సమర్పించుకున్నారు. దీంతో క్యూలైన్లతో పాటు ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ప్రస్తుతం సాధారణ దర్శనానికి 5 గంటలకు పైగా సమయం పడుతోంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో రమాదేవి స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు. తాగునీరు, క్యూలైన్ల నిర్వహణపై సిబ్బందికి తగు సూచనలు చేశారు. రద్దీని క్రమబద్ధీకరించడానికి ఏఎస్పీ రిత్విక్ సాయి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచారు.



## చరిత్రలో నిలిచిపోయేలా..

- సమ్మక్క సారలమ్మ ఆలయ పునర్నిర్మాణం..
- సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు..
- నేడు చేసి చూపిస్తున్నారు..
- 930 ఏళ్ల నాటి కోయల తాళపత్ర గ్రంథాల్లోని విశేషాలకు శిల్ప రూపం
- రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క

02

జనవరి 1న కృష్ణా, గోదావరి జలాలపై

## మంత్రి ఉత్తమ్ పీపీటీ

### ప్రజాభవన్‌లో కార్యక్రమం



**హైదరాబాద్, మహా :** వచ్చే నెల 1న రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కీలక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ముఖ్యంగా కృష్ణా, గోదావరి జలాల అంశంపై కాంగ్రెస్ పార్టీ నేతలకు ముఖ్యంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వివరించనున్నారు. ప్రగతిభవన్ వేదికగా నిర్వహించే ఈ పీపీటీలో రాష్ట్ర జలవిధానంపై ప్రభుత్వ వైఖరి, గత పాలనలో జరిగిన నిర్ణయాలు, ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లపై సమగ్రంగా వివరించనున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా హాజరుకానున్నారు. ప్రధానంగా అసెంబ్లీలో కృష్ణా, గోదావరి జలాలపై అసెంబ్లీలో ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించే లక్ష్యంతో.. గత ప్రభుత్వం చేసిన ద్రోహాన్ని వివరించేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతున్నది. 2, 3వ తేదీల్లో గోదావరి, కృష్ణా జలాలపై అసెంబ్లీలో ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వబోతున్నారు. అయితే.. అధికారంలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సైతం ఈ సబ్జెక్టు మీద అవగాహన ఉండాలనే ఉద్దేశంతో వారికి ఒకరోజు ముందుగానే పీపీటీలో వివరించనున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సమయంలో జలాల విషయంలో జరిగిన రాజీలను అసెంబ్లీలో గట్టిగా ప్రస్తావించేందుకు, పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఒకే వాయిస్‌తో మాట్లాడేందుకు ఈ ప్రజెంటేషన్‌ను కీలకంగా భావిస్తున్నారు.

## సీఎం వాడే భాష ఇదేనా

- రేవంత్ ను కొడంగల్ లో కూడా గెలవనీయం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

వివరాలు 2లో

## సొంతగూటికి రాజాసింగ్

### బిజెపి హైకమాండ్ గ్రీన్ సిగ్నల్

రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం

పార్టీ ఎప్పుడూ పిలిస్తే అప్పుడు చేరుతానని లేఖ విడుదల చేసిన ఎమ్మెల్యే



**హైదరాబాద్, మహా :** బీజేపీకి రాజీనామా చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ త్వరలోనే సొంత గూటికి తిరిగి చేరబోతున్నారు. కట్టర్ హిందూత్వ వాదిగా పేరున్న రాజాసింగ్ పార్టీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక ప్రక్రియతో విబేధించి కొంతకాలం క్రితం బీజేపీకి రాజీనామా చేశారు. దాన్ని పార్టీ ఆమోదించింది కూడా. ఆనాటి నుంచి ఆయన ఏ పార్టీలో చేరకుండా స్వతంత్రంగానే వ్యవహరిస్తున్నారు. మిగతా 2లో

# ఢిల్లీకి సీఎం రేవంత్

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లారు. శనివారం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో రేవంత్ రెడ్డి కూడా పాల్గొంటున్నారు. ఢిల్లీలో నూతనంగా నిర్మించిన ఏఐసీసీ కార్యాలయం ఇందిరా భవన్‌లో ఉదయం 10.30 గంటలకు అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఈ కీలక సమావేశం ప్రారంభం కానుంది. ఈ సమావేశంలో, దేశవ్యాప్తంగా నెలకొన్న రాజకీయ పరిస్థితులు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు, రాబోయే ఎన్నికలు, పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నట్లు సమాచారం. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తదితరులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. సీఎం ఢిల్లీ పర్యటన సందర్భంగా పలువురు నేతలకు నామినేటెడ్ పదవులపై క్లియరెన్స్ లభిస్తుందని భావిస్తున్నారు.

## ఓటీటీకి వచ్చేసిన
# కీర్తి సురేశ్ మూవీ

**మహా:** కీర్తి సురేశ్ కి తమిళ ..తెలుగు భాషాల్లో మంచి క్రేజ్ ఉంది. రీసెంట్ గా ఆమె చేసిన 'రివాల్వర్ రీటా' ఓటీటీ తెరపైకి వచ్చేసింది. తమిళ ..తెలుగు భాషలతో పాటు, ఇతర భాషలలోనూ ఈ సినిమా ఓటీటీ ఆడియన్స్ ను పలకరించింది. ఈ సినిమా ఓటీటీ హక్కులను 'నెట్ ఫ్లిక్స్'వారు సొంతం చేసుకున్నారు. శుక్రవారం నుంచే ఈ సినిమాను స్ట్రీమింగ్ కి తీసుకొచ్చారు. కీర్తి సురేశ్ ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సినిమాలో, రాధిక ..సునీల్ ..అజయ్ ఘోష్ కీలకమైన పాత్రలను పోషించారు. క్రైమ్ కామెడీ జోనర్లో నడిచే కథ ఇది.

# గ్రేటర్ విజయవాడ

**విజయవాడ, మహా :** ఏపీలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న రాజధాని నగరం అమరావతిలో భాగంగా ఉన్న విజయవాడ సిటీని గ్రేటర్ విజయవాడగా మార్చేందుకు వేగంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. సీఎం చంద్రబాబును విజయవాడకు చెందిన ఎంపీ కేశినేని, ఇతర ఎమ్మెల్యేలు కలిశారు. ఈ సందర్భంగా ఆయన గ్రేటర్ విజయవాడ ఏర్పాటుకు అంగీకరించారు. వెంటనే అధికారుల్ని పిలిచి ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రేటర్ లో మొత్తం విజయవాడ సిటీతో కలిపి 75 గ్రామాల్ని కలిపేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందులో 41 గ్రామాలు 2018లోనే గ్రేటర్ కోసం తీర్మానాలు చేయగా, కొత్త గ్రామాలు కూడా తాజాగా తీర్మానాలు చేసి ఇచ్చాయి. వీటిపై సీఎంలో కార్యదర్శి ప్రద్యుమ్న స్పందిస్తూ.. అన్నీ సక్రమంగా ఉంటే ఈ నెలాఖరులోపు నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు.

### ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ స్థలాన్ని
## పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
### రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రాజెక్టుకు పూర్తి సహకారం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న విస్తీర్ణంపై అధికారులు మ్యాపింగ్‌ను మంత్రికి చూపించి, వివరాలను నివేదించారు.ఈ విమానాశ్రయం నిర్మాణం ఆదిలాబాద్ జిల్లా ప్రజల చిరకాల స్వప్నమని, ఈ ప్రాజెక్టు పూర్తి కోసం కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. నిర్మాణ పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభమయ్యేందుకు ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి కూడా ఈ ప్రాజెక్టుకు పూర్తి సహకారం ఉంటుందని ఆశిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తే, ఈ ప్రాంత ప్రజల రవాణా, వ్యాపార అవసరాలు తీరుతాయన్నారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణ ప్రక్రియలో మరింత వేగం పుంజుకునేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ విమానాశ్రయం భవిష్యత్తులో ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధికి, పర్యాటక రంగానికి ఊతమిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# చరిత్రలో నిలిచిపోయేలా

(మేడారం నుండి మహా ప్రతినిధి)



ప్రపంచ చరిత్రలోనే సమ్మక్క సారలమ్మ మహా జాతర పునర్నిర్మాణ పనులు ఒక మైలు రాయిగా నిలిచిపోతాయని, ఈ పనులు 200 ఏళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేలా చేపడుతున్నామని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. 4 వేల టన్నుల గ్రానైట్ పై ఆదివాసీ చరిత్ర సంస్కృతి తెలియజేసే 7,000 బొమ్మలతో సమ్మక్క సారలమ్మ ఆలయ నిర్మాణం పనులు వేగవంతంగా సాగుతున్నాయని స్పష్టం చేశారు. శుక్రవారం ములుగు జిల్లా మేడారంలో సమ్మక్క సారలమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు పరిశీలించేందుకు హైదరాబాదు నుంచి మీడియా ప్రతినిధుల బృందం సందర్శించింది. సమ్మక్క సారలమ్మ చరిత్ర ,పునర్నిర్మాణ నిర్మాణ పనులు, ఆదివాసీల మూలాలు, జాతర చరిత్రను మీడియా బృందానికి మంత్రి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతరను ఈసారి కొత్త రూపుతో.. వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు.. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరిగే జాతరకు తెలంగాణతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కోటి మందికి పైగా భక్తులు తరలి వస్తారని అంచనా వేస్తున్నామని పేర్కొన్నారు. ఈసారి ఎప్పుడూ కల్పించే తాత్కాలిక సౌకర్యాలతో పాటు శాశ్వత నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఎన్నడూ లేనివిధంగా రూ.251 కోట్లతో మేడారం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. ఇందులో ప్రధానంగా వనదేవతల గద్దెల విస్తరణ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందనీ, ఈ పనులకే రూ.101 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. పునరుద్ధరణ పనులు చేపట్టే సమయంలో గిరిజన పూజారులతో అనేకసార్లు సమావేశాలు నిర్వహించి పూజారుల సంఘం అభిప్రాయం తీసుకుని పూజారులను ఒప్పించడం జరిగిందని, ఒకే లైన్లో వన దేవతలు ఉండడం వల్ల భక్తులు దర్శనాలు చేసుకోవడానికి సులువుగా ఉంటుందని పేర్కొన్నారు. పూర్వకాలంలో గిరిజనులకు పసుపుతో ఎంతో బంధం ఉందని, శాస్త్రీయంగా పసుపుతో పలు వ్యాధులను నయం చేసుకునే అవకాశం ఉందని దీనిని వాడకం వల్ల పూర్వం ఆదివాసులు ఎలాంటి వ్యాధుల బారిన పడిన పసుపును వాడుకున్నారని తెలిపారు. సమ్మక్క తల్లి గోత్రం బండారి గోత్రమని, తమ ఆదివాసీల సాంప్రదాయం ప్రకారం ప్రతి పనిని కుడి నుండి ఎడమవైపు నడుస్తుందని, నవగ్రహాలు సైతం కుడి నుండి ఎడమవైపే తిరుగుతున్నాయని వివరించారు. స్వస్తిక్ ఏర్పాటు చేసే విషయంలో సైతం పకృతి సిద్ధాంతాన్ని ఆచరించామని పేర్కొన్నారు. జాతరకు వచ్చే భక్తులు ఒకే వరుస క్రమంలో సులభతరంగా దర్శనం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. జాతర కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా జరుపుతామని మంత్రి తెలిపారు. చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో ఈసారి సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహిస్తున్నామని భక్తులందరూ విజయవంతానికి కృషి చేయాలని సహకరించాలని కోరారు.

**ఆదివాసిల సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట**

ఆదివాసిల సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీటవేస్తూ ప్రతి నిర్మాణం చేపడుతున్నామని సంస్కృతి ప్రతిబింబించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆదివాసి పూజార్ల సంఘం ప్రతినిధుల ఆమోదంతోనే పునర్నిర్మాణ పనులు చేపట్టామని వివరించారు. చరిత్రలో సుమారు 250 ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా నాణ్యతా ప్రమాణాల్లో ఎక్కడ రాజీ పడకుండా పనులు చేపట్టేలా ప్రతినిత్యం సమీక్షిస్తున్నామని నిత్యం మంత్రుల బృందం పరిశీలిస్తూ అధికారులకు సూచనలు చేస్తూ పనులు ముమ్మరం చేస్తున్నామని తెలిపారు. ఈ పనులు తుది దశకు చేరుకున్నాయని త్వరలో పూర్తికానున్నాయని. తెలిపారు గతంలో పిసిసి అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా మేడారం సందర్శించారని తెలిపారు. ఆ సమయంలో ప్రజలు ఆదివాసీలు ఆలయాన్ని విస్తరించాలని కోరగా అధికారంలోకి రాగానే తప్పకుండా ఆలయాన్ని పునర్నిర్మిస్తామని మాట ఇచ్చి నేడు ఆ హామీని నిలుపుకుంటున్నారని తెలిపారు.

**సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 251 కోట్లు మంజూరు చేశారని మేడారం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారనీ, పనులను వేగవంతం చేస్తున్నారని నిత్యం నిర్మాణం పనులను సమీక్ష చేస్తున్నారని సీతక్క చెప్పారు. గత ప్రభుత్వ హాయంలో తాత్కాలిక పనుల పేరిట నిధులను దుర్వినియోగం చేశారని, ఇప్పుడు అలా కాకుండా ప్రభుత్వం పక్కా పకడ్బందీ వ్యూహంతో శాశ్వతంగా నిర్మాణ పనులు చేపడుతున్నదని చెప్పారు. చరిత్రలోనే కనివీని ఎరుగని రీతిలో ఈ దఫా ఆదివాసి కుంభమేళాగా పేరుగాంచిన సమ్మక్క సారలమ్మ జాతరను నిర్వహిస్తున్నామని భక్తులంతా సహకరించాలని పేర్కొన్నారు. గద్దెల ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నామని. 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉండనుందన్నారు. వీటి మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలుంటాయని వివరించారు గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పున ప్రధాన స్వాగత తోరణం ఉంటుంధని తెలిపారు. వృత్తాకారంలో ఉండే గద్దె చుట్టూ 8 స్తంభాలు, మధ్యలో వెదురు బొంగులతో తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

**శిలలపై ఆదివాసీల సంస్కృతికి పెద్దపీట**

శిలలపై ఆదివాసుల సంస్కృతికి పెద్దపీట వేస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తాళపత్రాల్లోని కోయ వంశీయుల చరిత్రను ప్రాంగణం గోడలపై చిహ్నాలుగా, బొమ్మలుగా చెక్కించామని వివరించారు. ప్రధాన స్వాగత తోరణంపై సమ్మక్క వంశీయుల చరిత్ర తెలిపే 59 బొమ్మలు చెక్కించామని పేర్కొన్నారు. దాదాపు 750 మంది కోయ వంశీయుల పేర్లకు సంబంధించి ఏడు వేల బొమ్మలుంటాయని పేర్కొన్నారు. డాక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో 250 మంది శిల్పులు పనిచేశారనీ, స్థపతులు ఈమని శివనాగిరెడ్డి, డాక్టర్ మోతీలాల్ పర్యవేక్షిస్తున్నారనీ చెప్పారు సమ్మక్కసారలమ్మ ఆర్కియాలజీ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ కు చెందిన 15 మంది విద్యార్థులు ఈ చిత్రాల రూపకల్పనలో సాయం అందించారని పేర్కొన్నారు

**పనుల వేగ పంతానికి మంత్రుల బృందం ప్రతిరోజు సమీక్ష..**

మేడారం ఆలయంలో పునర్నిర్మాణ పనులు వేగవంతానికి మంత్రుల బృందం ప్రతిరోజు సమీక్ష నిర్వహిస్తున్నది. పనులను పరిశీలిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నది. పనుల్లో పూర్తి నాణ్యత పాటించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఏది అవసరం పడినా వెంటనే తెప్పిస్తున్నారు. అధికారుల పురామయిస్తూ పనుల వేగవంతానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి ప్రతి రోజు పనుల వేగవంతంపై వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్.పి. సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఈ ఓ వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గారావు, స్థపతి శివనాజిరెడ్డి, మైపథి అరుణ్ కుమార్, పూజారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సొంతగూటికి రాజాసింగ్
## బిజెపి హైకమాండ్ గ్రీన్ సిగ్నల్
### రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం
### పార్టీ ఎప్పుడూ పిలిస్తే అప్పుడు చేరుతానని లేఖ విడుదల చేసిన ఎమ్మెల్యే

(మొదటిపేజీ తరువాయి)



అయితే ప్రస్తుతం ఆయన తిరిగి కమలం గూటికి తిరిగి చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే అగ్రనాయకులతో చర్చలు సఫలం అయినట్లు తెలుస్తోంది. దీంతో ఆయన బీజేపీలో చేరేందుకు ముహూర్తం ఫిక్స్ అయినట్లు ప్రచారం సాగుతోంది. వచ్చే నెలలో కాషాయ కండువా కప్పుకునే ఛాన్స్ ఉందని రాజసింగ్ సన్నిహితులు చెబుతున్నారు. రీ జాయినింగ్ పై ఇప్పటికే జాతీయ నాయకులతో రాజసింగ్ మాట్లాడినట్లు సమాచారం. కొద్ది రోజుల క్రితం ఢిల్లీ వెళ్లొచ్చిన రాజాసింగ్ తన టూర్ లో హస్తిన పెద్దలతో లెక్క పక్కా చేసుకొని వచ్చాడని అనుచరులు చెబుతున్నారు.

ఇటీవల బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నియమితులైన నితిన్ నబీన్ ను రాజాసింగ్ కలిసినట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. ఈ సందర్భంగా తను తిరిగి సొంతగూటికి రావాలనుకుంటున్న విషయాన్ని పార్టీ ముఖ్యుల వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది. దీనికి పార్టీ పెద్దలు కూడా అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది. అన్ని అనుకున్నట్లు జరిగితే వచ్చే నెలలోనే ఆయన తిరిగి కాషాయం కండువ కప్పుకునే అవాకాశం ఉందని తెలుస్తోంది. అసంతృప్తితో రాజాసింగ్ బీజేపీకి రాజీనామా చేయడం, దాన్ని పార్టీ ఆమోదించడం చకాచకా జరిగిపోయాయి. అయితే గతంలోనూ రాజాసింగ్ పార్టీ లైన్ దాటి చేసిన పరుష వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకుని బీజేపీ ఆయన్ను సస్పెండ్ చేసింది. గత శాసనసభ ఎన్నికల ముందే తిరిగి పార్టీలోకి తీసుకుని గోషామహల్ టికెట్‌ను బీజేపీ రాజాసింగ్‌కు ఇచ్చింది. ఆ ఎన్నికల్లో రాజాసింగ్ గెలిచి ఎమ్మెల్యే అయ్యారు. తిరిగి ఇదే కథ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ పునరావృతం కావచ్చు. తిరిగి బీజేపీలోనే ఎన్నికల ముందు చేరి గోషామహల్ నుండి పోటీ చేసే అవకాశం లేకపోలేదు. ఎందుకంటే గోషామహల్‌లో రాజాసింగ్‌ను మించి బలమైన అభ్యర్థి బీజేపీకి దొరికే అవకాశం లేదనే చెప్పాలి. రాజాసింగ్ గోషామహల్ నియోజకవర్గంలో పట్టున్న నేత. 2018 ఎన్నికలలో బీజేపీ నుంచి ఏకైక ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భాలు ఉన్నాయి. ఇది పార్టీ గుర్తింపుతో కాకుండా, నియోజకవర్గంలో ఆయనకున్న సొంత బలంగానే చూడాలి. రాజాసింగ్ 2009లో టీడీపీ నుండి జీహెచ్ఎంసీలోని మంగళ్‌హాట్‌లో కార్పొరేటర్‌గా గెలిచారు. 2014 వరకు అదే పదవిలో ఉన్నారు. ఆ తర్వాత ఆయన బీజేపీలో చేరారు. ఏ పార్టీ మారినా తన హిందుత్వ సిద్ధాంతాలను మాత్రం వదులుకోలేదు. ఇదే రాజాసింగ్ బలంగా చెప్పవచ్చు. బీజేపీలో ఉన్న అంతర్గత గొడవల కారణంగానే ఆయన బయటకు వచ్చారు. రాజాసింగ్‌కు పార్టీ గుర్తింపు కాకుండా హిందుత్వవాదిగా మంచి గుర్తింపు ఉంది. తన సొంత బలంతో వచ్చే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా కూడా గెలిచే అవకాశాలు లేకపోలేదు. అందుకే బీజేపీ తిరిగి అతన్ని పార్టీలోకి తీసుకోవాలని భావిస్తోంది.తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హిందుత్వ, మోదీ పట్ల తన విధేయత చెక్కుచెదరలేదని.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయనని స్పష్టం చేశారు. దీంతో ఆయన సొంత గూటికి చేరడం ఖాయమని తెలుస్తోంది.

**ఆ శుభ సమయం ఎప్పడనేది చెప్పలేను : రాజాసింగ్**

పార్టీలో చేరే అంశంపై రాజాసింగ్ ను ప్రశ్నించగా ఒక కుటుంబంలో నలుగురు అన్నదమ్ములు ఉండి, ఒక అన్నయ్య గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోతే, ముందుగానో లేదా తరువాత ఆ సోదరుడు ఇంటికి తిరిగి రావాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. ఈరోజు కాకపోతే, రేపు నేను కూడా నా ఇంటికి తిరిగి వెళ్ళవలసి ఉంటుందన్నారు. అయితే ఆ శుభ సమయం ఎప్పుడు వస్తుందో నేను మీకు చెప్పలేను అని అన్నారు. నేను భారతీయ జనతా పార్టీకి నిజమైన సైనికుడిని. ఢిల్లీ లేదా రాష్ట్ర ఉన్నతాధికారులు నన్ను పిలిచిన రోజు, నేను నా పార్టీకి తిరిగి వస్తాను అని పేర్కొన్నారు. నేను ఇంతకు ముందు కూడా ఇదే అభ్యర్థన చేశాను. ఈ రోజు కూడా అదే అభ్యర్థన చేస్తున్నాను. మన అసెంబ్లీలో స్వేచ్ఛ కల్పించాలి. ప్రతి ఎమ్మెల్యే, ప్రతి ఎంపీకి వారి నియోజకవర్గంలో స్వేచ్ఛ ఇవ్వాలి. అప్పుడే మన పార్టీ భవిష్యత్తులో అధికారంలోకి రాగలదు. ఈరోజు కాకపోయినా రేపు నాకు ఢిల్లీలోని మన పెద్ద నాయకుల నుండి లేదా రాష్ట్రంలోని మన పెద్ద నాయకుల నుండి పిలుపు వస్తుందని నాకు ఖచ్చితంగా తెలుసు అని మనసులోని మాటను వెల్లడించారు. ఇవ్వాళ లేకపోతే రేపు మా పెద్దోళ్ళ నుంచి నాకు ఫోన్ వస్తే ఒకటే ఒక రిక్వెస్ట్ చేస్తాను నేను మా పెద్ద నాయకులు తోని మాకు స్వేచ్ఛ ఇవ్వండి అని అన్నారు. దాని తర్వాత చూడండి బీఆర్ఎస్, కాంగ్రెస్ ఈ ఎంఐఎం పార్టీలతో మేము ఏ విధంగా యుద్ధం చేస్తామో అని అన్నారు.

# మావోయిస్టులకు మరణశాసనం రాసిన 2025
### ఉనికి నిలబెట్టుకోవడం ఇక అసాధ్యమే.. దెబ్బ మీద దెబ్బతో విలవిలలాడిన ఉద్యమం

(మొదటిపేజీ తరువాయి)



ముఖ్యంగా అబూజ్‌మడ్ వంటి అభేద్యమైన కోటల్లోకి చొచ్చుకెళ్లి మరీ భద్రతా బలగాలు మావోయిస్టు అగ్రనేతలను మట్టుబెట్టాయి.

**ఆపరేషన్ కగార్ మెరుపు దాడులు**

కేంద్ర హోం శాఖ నేతృత్వంలో వ్యూహాత్మకంగా అమలు చేసిన ఆపరేషన్ కగార్ 2025లో తీవ్రం అయింది. డ్రోన్ టెక్నాలజీ, శాటిలైట్ మ్యాపింగ్ , గ్రేహౌండ్స్ దళాల సమన్వయంతో అడవులను జల్లెడ పట్టారు. జూన్ , సెప్టెంబర్ నెలల్లో జరిగిన రెండు భారీ ఎన్‌కౌంటర్లలోనే దాదాపు 60 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఇందులో అత్యధిక రివార్డులు ఉన్న సీనియర్ క్యాడర్ సభ్యులు ఉండటం మావోయిస్టు పార్టీని నాయకత్వ లేమితో కుంగదీసింది. దండకారణ్యంలో గతంలో మావోయిస్టులకు ఉన్న గెరిల్లా పట్టు ఈ ఏడాది దాదాపుగా సడలిపోయింది.

**అగ్రనేతల పతనం - కుప్పకూలిన మేధోమథనం**

2025లో మావోయిస్టు సెంట్రల్ కమిటీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉంటూ పార్టీని నడిపిస్తున్న కీలక నేతలు అనారోగ్య కారణాల వల్ల కొందరు, ఎన్‌కౌంటర్ లలో మరికొందరు మరణించారు. అగ్రనేతల మరణం లేదా లొంగుబాటుతో పార్టీలో అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. కొత్త రిక్రూట్‌మెంట్ దాదాపు శూన్యం కావడంతో, కేవలం పాత నేతలతోనే కాలం వెళ్లదీస్తున్న పార్టీకి 2025 సంవత్సరం ఒక డెడ్ ఎండ్ లా మారింది. వృద్ధనేతలు చనిపోయినా మాడ్వీ హిడ్మా లాంటి వాళ్లు పార్టీని కాపాడుతారని అనుకున్నా.. ఆయన కూడా ఎన్ కౌంటర్‌అయ్యారు.

**మారిన ఆదివాసీల మనస్తత్వం - అభివృద్ధి బాట**

మావోయిస్టుల పతనానికి బలగాల దాడులు ఒక కారణమైతే, స్థానిక ఆదివాసీల మద్దతు తగ్గడం మరో ప్రధాన కారణం. 2025లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం, సెల్ టవర్ల ఏర్పాటు , పాఠశాలల స్థాపనను వేగవంతం చేశాయి. "తుపాకీ పట్టడం వల్ల అడవికి ఒరిగేదేమీ లేదు అనే అవగాహన ఆదివాసీ యువతలో పెరగడం వల్ల ఇన్ఫార్మర్ల వ్యవస్థ బలపడింది. ఇది మావోయిస్టుల కదలికలను ముందే పసిగట్టేందుకు బలగాలకు పెద్ద ఆయుధంగా మారింది.

**భారీగా లొంగుబాట్లు హింస వదిలి జనజీవన స్రవంతిలోకి..**

ఈ ఏడాది కేవలం ఎన్‌కౌంటర్లే కాకుండా, లొంగుబాట్లు కూడా రికార్డు స్థాయిలో జరిగాయి. ప్రభుత్వ పునరావాస ప్యాకేజీలు, అభివృద్ధి పట్ల ఆకర్షితులై వందలాది మంది దళ సభ్యులు తుపాకులను వదిలి పోలీసుల ఎదుట లొంగిపోయారు. మావోయిస్టు పార్టీ తమ సిద్ధాంతాలకు తిలోదకాలు ఇచ్చిందని, కేవలం హింసకే ప్రాధాన్యత ఇస్తోందని లొంగిపోయిన నేతలు ఆరోపించారు. 2025 ముగిసే సమయానికి మావోయిస్టు ప్రభావిత జిల్లాల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఒకప్పుడు దేశంలో 100కు పైగా జిల్లాల్లో విస్తరించిన ఈ సమస్య, ఇప్పుడు కేవలం కొన్ని చిన్న ప్రాంతాల కే పరిమితమైంది. మొత్తం మీద, 2025 మావోయిస్టులకు ఒక దురదృష్టకరమైన, పరాజయాల ఏడాదిగా మిగిలిపోయింది.

# రైతు భరోసా ఆగదు..



(మొదటిపేజీ తరువాయి)

పథకం అమలులో పారదర్శకత పెంచేందుకు ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతను వాడుతోంది. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జర్మన్ టెక్నాలజీ సాయంతో 'శాటిలైట్ మ్యాపింగ్' ప్రక్రియను చేపట్టింది. ఈ మ్యాపింగ్ ద్వారా లబ్ధిదారుల వద్ద ఉన్న అసలు సాగు భూమి ఎంత అనే విషయాన్ని ప్రభుత్వం నిర్ధారిస్తోంది. 2024లో నిర్వహించిన సర్వే ప్రకారం.. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఓఆర్ఆర్ , ఆర్ఆర్ఆర్ పరిధిలో దాదాపు 4 లక్షల ఎకరాల భూమి సాగులో లేదని, అవి వాణిజ్య అవసరాలకు లేదా రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారాయని ప్రభుత్వం గుర్తించింది. ఇలాంటి వాణిజ్య భూములకు, కొండలు, గుట్టలకు గతంలో అందిన సాయాన్ని ఇకపై నిలిపివేసి, కేవలం పంటలు పండించే భూములకే రైతు భరోసాను పరిమితం చేయనుంది. రైతు భరోసా పథకం కింద అర్హులైన ప్రతి రైతుకు రెండు సీజన్లకు కలిపి ఎకరానికి రూ. 12,000 చొప్పున ప్రభుత్వం అందించనుంది. గత ఏడాది దాదాపు రూ. 9,000 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని, ఈసారి కూడా రబీ, ఖరీఫ్ సీజన్లలో పంటలు వేసే వారందరికీ ఈ సాయం అందుతుందని పేర్కొంది. పథకం అమలులో ఎటువంటి కొత్త షరతులు విధించలేదని, కేవలం అనర్హులను తొలగించి నిజమైన సాగుదారులకు న్యాయం చేయడమే తమ ప్రాధాన్యతని అధికారులు తెలిపారు. జాబితా సవరణలో భాగంగా ఒకవేళ అర్హులైన రైతుల పేర్లు తొలగించబడినా, లేదా ఏదైనా అభ్యంతరాలు ఉన్నా రైతులు ఆందోళన చెందవద్దని ప్రభుత్వం సూచించింది. బాధితులు నేరుగా జిల్లా కలెక్టర్ లేదా జిల్లా స్థాయి రెవెన్యూ అధికారులను కలిసి తమ వివరాలను అందజేయవచ్చు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు భరోసా పంపిణీని కేవలం 9 రోజుల్లోనే పూర్తి చేసిన రికార్డు ఉందని, నిజమైన లబ్ధిదారులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం జరగదని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

# మెగా సిటీగా హైదరాబాద్

(మొదటిపేజీ తరువాయి)

గతంలో జిల్లా కలెక్టర్లుగా పనిచేసిన వారిని కూడా జోనల్ కమిషనర్లుగా నియమించడంతో సీఎం మెగా సిటీ మునిసిపల్ కార్పొరేషన్ ను ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారో అర్థమవుతోంది. గతంలో ఉన్న ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, సికింద్రాబాద్, ఎల్బీనగర్, చార్మినార్, కూకట్ పల్లి జోన్లకు తోడు కొత్తగా ఉప్పల్, కుత్బుల్లాపూర్, మల్కాజ్‌గిరి, శంషాబాద్, గోల్కొండ, రాజేంద్రనగర్ వంటి కొత్త జోన్లు ఏర్పడడంతో ప్రజలకు సేవలు మరింత దగ్గరయ్యాయి.

**2026లో జీహెచ్ఎంసి ఎన్నికలు**

గ్రేటర్ హైదరాబాద్ లో ప్రజలకు మరింత జవాబుదారీతనంతో సేవలందించేందుకు 2026లోనే జీహెచ్ఎంసి ఎన్నికలు నిర్వహించాలని సీఎం భావిస్తున్నారు. కొత్త వార్డుల పునర్విభజనతో ప్రజాప్రతినిధుల సంఖ్య పెరగనుండగా, స్థానిక సమస్యలకు వేగంగా పరిష్కారం దొరికే అవకాశం ఉంది. ప్రాథమిక నోటిఫికేషన్ విడుదలైన తర్వాత ప్రజలు, రాజకీయ పార్టీల నుండి సుమారు 6,000కు పైగా అభ్యంతరాలు, సూచనలు వచ్చాయి. వాటన్నింటినీ పరిశీలించిన అధికారులు 40 వార్డులకు పాత పేర్లనే కొనసాగించాలని నిర్ణయించారు. ప్రస్తుత జీహెచ్ఎంసీ పాలకమండలి పదవీకాలం 2026 ఫిబ్రవరి 10తో ముగియనుంది. ఈ లోపే వార్డుల పునర్విభజన , ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియను పూర్తి చేసి, కొత్త వార్డుల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఈ మెగా కార్పొరేషన్‌ను ఒకటిగా ఉంచాలా లేదా మూడు ప్రత్యేక కార్పొరేషన్లుగా విభజించాలా అనే అంశంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ పునర్విభజనతో హైదరాబాద్ మునిసిపల్ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలు మొదలయ్యే అవకాశం ఉంది.

**పబ్లిక్ హ్యాపీ**

12 జోన్లు, 60 సర్కిళ్ల వ్యవస్థ 300 డివిజన్లు అమల్లోకి రావడంతో అధికారులు ప్రజలకు మరింత అందుబాటులోకి వచ్చారు. ఫిర్యాదుల పరిష్కారం వేగంగా జరిగే అవకాశం ఉండడంతో పౌరులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా సీఎం రేవంత్ రెడ్డి విజన్, ఐఏఎస్ అధికారుల సమర్థ పరిపాలన, విస్తరించిన జీహెచ్ఎంసి నిర్మాణంతో హైదరాబాద్ మెగా సిటీ రాబోయే కాలంలో దేశానికే ఆదర్శంగా నిలవనుంది.

# కేసీఆర్‌ను అసెంబ్లీకి రప్పిస్తున్న సీఎం

(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో పార్టీ అధినేత కేసీఆర్ భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా భారీ బహిరంగ సభలు నిర్వహించాలని ఆయన నిర్ణయించారు. సమావేశంలో కేసీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చరిత్రను పరిశీలిస్తే కాంగ్రెస్ ఎప్పుడూ తెలంగాణకు ద్రోహమే చేస్తూ వచ్చిందని ఆయన విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తోందని.. తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెడుతోందని మండిపడ్డారు. తెలంగాణ అస్థిత్వం కోసం, ఇక్కడి ప్రజల హక్కుల కోసం పోరాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఇతర పార్టీలకు తెలంగాణ అభివృద్ధి కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని ఎద్దేవా చేశారు.

**అసెంబ్లీ వేదికగా వివరిద్దాం**

తెలంగాణకు రావాల్సిన నీటి హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని కేసీఆర్ తేల్చి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చూపుతున్న వివక్షను, రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు. నీటి వాటాల విషయంలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని అసెంబ్లీ వేదికగా ప్రజలందరికీ అర్థమయ్యేలా వివరిస్తామని చెప్పారు. 'ఇకపై ఊరుకునే ప్రసక్తే లేదు.. తెలంగాణ ద్రోహుల అసలు రంగును బట్టబయలు చేస్తాం' అని ఆయన హెచ్చరించారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. ముందుగా నిర్ణయించిన విధంగా మూడు జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ.. తెలంగాణ హక్కుల కోసం మరో ఉద్యమాన్ని నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై మౌనంగా ఉంటే భవిష్యత్తు తరాలకు నష్టం జరుగుతుందని, అందుకే ప్రజలను చైతన్య పరిచి పోరాట బాట పట్టాలని కేసీఆర్ నిర్ణయించారు. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నేతలు పాల్గొని, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం మరియు నిరసన కార్యక్రమాల నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో ముఖ్యనేతలు కేటీఆర్, హరీష్, జగదీష్ రెడ్డి, శ్రీనివాసగౌడ్, లక్ష్మారెడ్డి, తదితర నేతలు పాల్గొన్నట్లు తెలుస్తోంది.



# సీఎం వాడే భాష ఇదేనా...

## రేవంత్ ను కొడంగల్ లో కూడా గెలవనీయం.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

**హైదరాబాద్, మహా :** సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను కూడా హైదరాబాద్ గల్లీల్లో పెరిగిన వాడినని.. మాట్లాడమంటే ఉర్దూలో, హిందీలో, తెలుగులో, ఇంగ్లీషులో పొల్లు పోకుండా తిట్టే తెలివి ఉందంటూ కౌంటర్ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో కొడంగల్ లో రేవంత్ రెడ్డిని ఓడిస్తామని శపథం చేశారు. కేసీఆర్ అడిగిన సూటి ప్రశ్నలకు సమాధానం చెప్పే తెలివి లేకనే రేవంత్ రెడ్డి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్ లో చేరికల సందర్భంగా మాట్లాడిన కేటీఆర్ సీఎం రేవంత్ వ్యాఖ్యలకు ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. "మొన్న కేసీఆర్ ఏమడిగారు? పాలమూరు ప్రాజెక్ట్ ఎందుకు పండపెట్టినవు అని అడిగారు. ఎనిమిది నెలల క్రితమే కేంద్ర ప్రభుత్వం డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ను వెనక్కి పంపినా, దానిని మళ్ళీ పంపి ప్రాజెక్ట్ పూర్తి చేయాలనే సోయి ఈ ముఖ్యమంత్రికి ఉందా? 90 శాతం పనులు పూర్తయిన ప్రాజెక్టుపై ఇంకొక పది పైసలు ఖర్చు పెడితే పాలమూరుకు నీళ్లు వస్తాయి, ఆ పని చేయమని అడగడం తప్పా?" అని కేటీఆర్ ప్రశ్నించారు.



కృష్ణా జలాల విషయంలో మోదీ, బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై ఢిల్లీలో కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారని కేసీఆర్ నిలదీశారని కేటీఆర్ గుర్తు చేశారు. ఆ భయంతోనే రేవంత్ రెడ్డి బూతు పురాణం అందుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. "ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి? నెలకు రూ. 4000 పెన్షన్, తులం బంగారం, ఆడపిల్లలకు రూ. 2500 ఇస్తామని 100 రోజుల్లో నెరవేరుస్తామన్న హామీలు ఏమయ్యాయి? రెండేళ్లు దాటినా ఎందుకు ఇవ్వడం లేదని ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ ప్రశ్నిస్తే.. సమాధానం చెప్పాల్సింది పోయి బూతులు తిట్టడం ఏంటి..?" అని కేటీఆర్ నిలదీశారు. "రేవంత్ రెడ్డి, మిమ్మల్ని వ్యక్తిగతంగా తిట్టాలని నాకు లేదు. కానీ, తెలంగాణ తెచ్చిన నాయకుడిని, రెండు సార్లు ప్రజలు గెలిపించిన ముఖ్యమంత్రిని, నా తండ్రిని మీరు తిడుతుంటే ఒక కొడుకుగా నాకు ఆవేశం రాదా? కేసీఆర్‌ను రోజు తిడుతూనే ఉన్నాడు. ఒకరోజు చనిపోవాలనుకుంటాడు, ఒకరోజు కాలు విరిగింది అంటాడు, ఇంకోరోజు ఇంకేదో అంటారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాము కాబట్టి కుర్చీకి ఇచ్చే గౌరవంతో ఊరుకుంటున్నాం. కనకపు సింహాసనంపై శునకాన్ని కూర్చుండబెట్టినట్టు ఉంది నేటి పరిస్థితి" అని కేటీఆర్ ఘాటుగా విమర్శించారు. "ఢిల్లీలో పైసలు ఇచ్చి ముఖ్యమంత్రి పదవి తెచ్చుకున్నావు, ఇప్పుడు కూడా నెల నెలా ఢిల్లీకి పైసలు పంపిస్తూ పదవి కాపాడుకుంటున్నావు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వారికి హుందాతనం ఉండాలని... కానీ మీలో రోజూ ఈ ఏడుపు ఎందుకు?" అని కేటీఆర్ నిలదీశారు.

"నీ అమ్మ, నీ అయ్య.. గిదా నీకు నేర్పిన భాష? గత రెండేళ్లలో నువ్వు చేసిన అభివృద్ధి శూన్యం, కేవలం తిట్లు తిట్టడం తప్ప నీకు ఏమీ రాదు. కుర్చీకి ఇచ్చే గౌరవంతోనే ఊరుకుంటున్నాం. నీ అదృష్టం బాగుండి ముఖ్యమంత్రి పదవి దక్కింది. కానీ నీ తీరు చూస్తుంటే 'కనకపు సింహాసనమున శునకము కూర్చుండబెట్టినట్టు' ఉంది" అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. "నేను గుంటూరులో చదువుకుంటే రేవంత్ రెడ్డికి ఎందుకు నొప్పి? అప్పుడు ఆంధ్రప్రదేశ్ కలిసి ఉంది. ఆ సమయంలో నేను గుంటూరులోనే కాకుండా హైదరాబాద్, పూణే, అమెరికా.. ఇలా ప్రపంచమంతా చదువుకున్నాను" అని స్పష్టం చేశారు. నేను ఆంధ్రాలో చదువుకుంటే తప్పంటున్న రేవంత్... ఆంధ్రా నుంచి అల్లుణ్ణి తెచ్చుకోవడం తప్పు కాదా? అందుకే ఈయనకు 'భీమవరం బుల్లోడు' అని పేరు పెడితే సరిపోతుంది" అని ఎద్దేవా చేశారు.

**కొడంగల్ లో ఓడిస్తాం**

"కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని కానీయను అని శపథాలు చేస్తున్న రేవంత్ రెడ్డికి ఒకటే చెబుతున్నా.. నీకు సత్తా ఉంటే హామీలు అమలు చేస్తానని శపథం చెయ్. వచ్చే ఎన్నికల్లో నిన్ను కొడంగల్‌లో కూడా గెలవనీయకుండా చేసే బాధ్యత మేము తీసుకుంటాం. మళ్ళీ కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయి" అని కేటీఆర్ అన్నారు.

# పెరిగిన రైలు టికెట్ ఛార్జీలు

**మహా :** భారతదేశంలో రైలు చార్జీలు భారీగా పెరిగాయి. ఈ ధరల పెంపు శుక్రవారం నుంచే అమలులోకి వచ్చింది. ఇటీవల రైల్వేశాఖ సుదూర ప్రయాణాలపై టికెట్ ఛార్జీలు పెంచడం తెలిసిందే. ఈ సవరించిన రైళ్ల ఛార్జీలు శుక్రవారం అంటే డిసెంబర్ 26 నుంచి అమల్లోకి వచ్చాయి. దీని కోసం రైల్వే డిసెంబర్ 21న నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రయాణికుల సౌకర్యం, నిర్వహణకు ఆర్థిక స్థిరత్వం మధ్య సమతుల్యత లక్ష్యంతో ప్రయాణీకుల ఛార్జీలలో హేతుబద్ధీకరణను ప్రకటించినట్లు రైల్వేశాఖ తెలిపింది.



**పెరిగిన ఛార్జీలు ఎప్పటి నుండి అమలులోకి వస్తాయి?**

రైల్వేశాఖ సమాచారం ప్రకారం, ఇటీవల సవరించిన ఛార్జీలు డిసెంబర్ 26 నుంచి అమలులోకి వచ్చేశాయి. ఇది ఈ తేదీ నుంచి బుక్ చేసుకున్న టిక్కెట్లకు మాత్రమే వర్తిస్తుంది. మీరు డిసెంబర్ 26కు ముందు టిక్కెట్ బుక్ చేసుకున్నట్లయితే, ఆ తర్వాత తేదీలలో ప్రయాణించాల్సి వచ్చినా, అదనపు ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు.

**ఈ కేటగిరీలలో ఛార్జీలు పెరగలేదు**

సీజన్ టిక్కెట్ల ఛార్జీలలో ఎటువంటి మార్పు చేయలేదని రైల్వేశాఖ స్పష్టం చేసింది. అంతేకాకుండా, సెకండ్ క్లాస్ సాధారణంలో 215 కిలోమీటర్ల వరకు ప్రయాణానికి సైతం ఎటువంటి ఛార్జీల పెరుగుదల లేదు.

**దూరం ఆధారంగా అదనపు ఛార్జీలు**

నాన్‌ఏసీ సాధారణ రైళ్లలో పెరిగిన ఛార్జీలు దూరం ఆధారంగా వర్తిస్తాయి. ఉదాహరణకు 216 కిమీ నుండి 750 కిమీ ప్రయాణానికి రూ. 5 పెరిగింది. 751 కిమీ నుండి 1250 కిమీ ప్రయాణానికి 10 రూపాయలు అదనంగా చెల్లించాలి. అదేవిధంగా, 1251 కిలోమీటర్ల నుంచి 1750 కిమీ ప్రయాణానికి 15 రూపాయలు, 1751 కిమీ నుండి 2250 కిమీ వరకు టిక్కెట్‌కు 20 రూపాయలు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. స్లీపర్ క్లాస్, జనరల్, ఫస్ట్ క్లాస్ ప్రయాణాలలో కిలోమీటరుకు 1 పైసా చొప్పున ఛార్జీలు పెరిగాయి.

**రైళ్ల ప్రకారం ఛార్జీలు ఎంత పెరిగాయి?**

రైల్వే ప్రకారం, మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నాన్‌ఏసీ ,యు ఏసీ రెండూ (స్లీపర్, ఫస్ట్ క్లాస్, ఏసీ చైర్ కార్, ఏసీ 3టైర్, ఏసీ 2టైర్, ఏసీ ఫస్ట్ క్లాస్) కిలోమీటరుకు 2 పైసలు ఛార్జీలు పెరిగాయి. ఉదాహరణకు, 500 కిమీ నాన్‌ఏసీ మెయిల్/ఎక్స్‌ప్రెస్ ప్రయాణానికి ప్రయాణికులు సుమారు ₹10 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. పెరిగిన ఛార్జీలు రాజధాని, శతాబ్ది, దురంతో, వందే భారత్, తేజస్, సంపర్క్ క్రాంతి, జన శతాబ్ది, అంత్యోదయ, గతిమాన్, అమృత్ భారత్, గరీబ్ రథ్, యువ ఎక్స్‌ప్రెస్, నమో భారత్ రాపిడ్ రైల్ తో సహా ఇతర ప్రధాన రైళ్లకు సమానంగా వర్తిస్తాయి.

**రైల్వే శాఖ తెలిపిన సమాచారం**

అంతేకాకుండా రిజర్వేషన్ ఛార్జీలు, సూపర్‌ఫాస్ట్ సర్ ఛార్జీలు, ఇతర సహాయక ఛార్జీలలో ఎటువంటి మార్పు చేయలేదని రైల్వేశాఖ స్పష్టం చేసింది. జీఎస్టీ రేట్లు, ఛార్జీల రౌండ్‌ఆఫ్ నియమాలు కూడా యథాతథంగా ఉంటాయి. నేటి (డిసెంబర్ 26) నుంచి స్టేషన్లలో ప్రదర్శించే ఛార్జీల జాబితా కూడా కొత్త ఛార్జీల ప్రకారం మాడిఫై చేయనున్నారు.

## రెండు కార్డుల సిద్ధాంతంతో జర్నలిస్టులకు అన్యాయం

- జీవో 252ను తక్షణమే ఉపసంహరించుకోవాలి
- టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ

**హైదరాబాద్, మహా :** డెస్క్ జర్నలిస్టుల మీద ఎందుకు వివక్ష అని.. రెండు కార్డుల సిద్ధాంతంతో జర్నలిస్టుల నడుమ చిచ్చు పెట్టాలని చూస్తే సహించేది లేదని టీయూడబ్ల్యూజే (143) రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ హెచ్చరించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులకు కనీస గుర్తింపును కూడా రద్దు చేస్తారా అని ప్రశ్నించారు. జర్నలిస్టుల హక్కులను కాపాడుకోవడానికి మరో పోరాటానికి సిద్ధమని స్పష్టం చేశారు. లోపభూయిష్టమైన జీవో 252ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన జీవో 239ను రద్దు చేయడం తెలంగాణ జర్నలిస్టుల హక్కులను కాలరాయడమేనని అన్నారు. డెస్క్ జర్నలిస్టులను అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి పగబట్టడం అన్యాయమన్నారు. 23 వేల మంది జర్నలిస్టులకు అక్రిడేషన్లు ఇచ్చిన ఘనత గత ప్రభుత్వానిదేనని చెప్పారు. నాడు కల్చరల్ రిపోర్టర్లకు, స్పోర్ట్స్ రిపోర్టర్లకు, ఇలా ప్రతి విభాగానికి విడివిడిగా అక్రెడిషన్లు జారీ చేశామని.. ఇప్పుడు అవన్నీ రద్దు చేయడం దుర్మార్గమన్నారు. వార్తా సేకరణలో ఫీల్డ్ జర్నలిస్టులది ఎంతటి కీలక పాత్రనో.. వార్తను తీర్చిదిద్దడంలో డెస్క్ జర్నలిస్టులది అంతే పాత్ర అని అభిప్రాయపడ్డారు. వారి అక్రెడిటేషన్లు రద్దు చేయడం అంటే పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడమేనన్నారు. వారిని రెండో శ్రేణి పౌరులుగా చూస్తూ మీడియా కార్డు పేరుతో వాళ్ల హక్కును రద్దు చేయాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. అలాగే.. పెద్ద పత్రికలకు, పెద్ద చానళ్ల జర్నలిస్టులకు గుర్తింపు కార్డులను కోత విధించడం సరికాదన్నారు. తెలంగాణలో అధికంగా ఉన్న కేబుల్ ఛానళ్ళ రిపోర్టర్లకు పూర్తిగా అన్యాయం చేశారన్నారు. శనివారం అన్ని జిల్లాల కలెక్టరేట్ల ముందు చేపడుతున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతిసాగర్, ఉపాధ్యక్షుడు రమేశ్‌హజారి, కోశాధికారి యోగానంద్, తేంజు ప్రధాన కార్యదర్శి రమణకుమార్, ఐజేయూ జాతీయ కార్యవర్గసభ్యులు అవ్వారి భాస్కర్, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి నవీన్‌కుమార్, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.మల్లేశ్, సుదర్శన్‌రెడ్డి, కోశాధికారి బాపూరావు తదితరులు పాల్గొన్నారు.

## బాల మేధావుల సాహసానికి జాతీయ వందనం

### రాష్ట్రపతి చేతుల మీదుగా పీఎం రాష్ట్రీయ బాల పురస్కారాల ప్రదానం





**ఢిల్లీ,మహా:** తమ వయసును మించిన ధైర్యసాహసాలు ప్రదర్శించిన చిన్నారులను, వివిధ రంగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన బాలలను భారత ప్రభుత్వం అత్యున్నత పురస్కారాలతో గౌరవించింది. 'వీర్ బాల్ దివస్' సందర్భంగా న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ఘనమైన వేడుకలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మొత్తం 20 మంది చిన్నారులకు 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్2025' అందజేశారు. సిక్కు గురువు గురుగోవింద్ సింగ్ కుమారులైన సాహెబ్‌జాదేల త్యాగాలను స్మరించుకుంటూ జరుపుకునే ఈ వేడుకలో, నేటి తరం బాల వీరుల గాథలు అందరినీ కంటతడి పెట్టించడమే కాకుండా గర్వపడేలా చేశాయి. ఈ ఏడాది పురస్కార గ్రహీతల్లో తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన ఎనిమిదేళ్ల వ్యోమప్రియ సాహసం ప్రత్యేకంగా నిలిచింది. తన అపార్ట్‌మెంట్‌లోని పార్కులో ఆడుకుంటున్న సమయంలో విద్యుత్ ఘాతానికి గురైన స్నేహితుడిని ప్రాణాలకు తెగించి కాపాడిన వ్యోమప్రియ, అదే క్రమంలో తాను విగతజీవిగా మారింది. మరణానంతరం ఆమెకు ప్రకటించిన ఈ సాహస పురస్కారాన్ని రాష్ట్రపతి చేతుల మీదుగా ఆమె తల్లిదండ్రులు స్వీకరించినప్పుడు రాష్ట్రపతి భవన్‌లో భావోద్వేగ వాతావరణం నెలకొంది. మరోవైపు పంజాబ్ సరిహద్దు గ్రామానికి చెందిన పదేళ్ల శ్రావణ్ సింగ్ ప్రదర్శించిన దేశభక్తి ప్రశంసలందుకుంది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ ప్రాణాలకు తెగించి ప్రతిరోజూ ఫార్వర్డ్ పోస్ట్‌ల వద్దకు వెళ్లి సైనికులకు పాలు, ఆహారం అందిస్తూ తన వంతు సామాజిక సేవ చేసినందుకు అతడికి ఈ గౌరవం దక్కింది. క్రీడారంగంలో బీహార్‌కు చెందిన 14 ఏళ్ల క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఈ అత్యున్నత పురస్కారాన్ని అందుకున్నారు. కేవలం 13 ఏళ్లకే రంజీ క్రికెట్‌లో అడుగు పెట్టడమే కాకుండా, ఐపీఎల్ వేలంలో అత్యంత పిన్న వయసులో రికార్డు ధర దక్కించుకుని, ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించినందుకు అతడి ప్రతిభను ప్రభుత్వం గుర్తించింది. వైభవ్‌తో పాటుగా తెలంగాణ నుంచి అంతర్జాతీయ స్కేటింగ్‌లో 43కు పైగా పతకాలు సాధించిన జెమ్మీ రాజ్ మాత్రపు, ఆంధ్రప్రదేశ్ నుంచి పారా అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న శివాని హోసూరు ఉప్పర కూడా రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారాలు అందుకుని తెలుగు రాష్ట్రాల కీర్తిని చాటారు. ఈ పురస్కారాలను సాహసం, కళా సాంస్కృతిక, ఆవిష్కరణలు, విద్యా ప్రతిభ, సామాజిక సేవ మరియు క్రీడలు అనే ఆరు విభాగాల్లో పంపిణీ చేశారు. విజేతలుగా నిలిచిన 11 మంది బాలురు, 9 మంది బాలికలకు పతకం, సర్టిఫికేట్‌తో పాటు లక్ష రూపాయల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమం ముగింపులో రాష్ట్రపతి మాట్లాడుతూ, నేటి చిన్నారులే రేపటి భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని, ఈ బాల మేధావుల విజయాలు దేశంలోని కోట్లాది మంది విద్యార్థులకు కొత్త ఉత్సాహాన్ని మరియు స్ఫూర్తిని అందిస్తాయని కొనియాడారు. ఈ వేడుకలో కేంద్ర మంత్రులు, పలువురు ప్రముఖులతో పాటు విజేతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి ఎంతో సహనంతో వ్యవహరిస్తున్నారు

### బీఆర్ఎస్ తిట్ల పురాణం మంచిపద్ధతి కాదు
### ఎంపీ మల్లు రవి హితవు

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుపై కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయాలు హుందాగా నడపాలి.. మేము అన్నట్టే రాజకీయాలు ఉండాలి లేకపోతే ఇష్టమున్నట్టు మాట్లాడుతాము అన్నట్టుగా బీఆర్ఎఎస్ నాయకులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకుల వ్యవహారాలను ప్రజలు గమనిస్తున్నారు. ఇది రాజకీయాలలో మంచి పరిణామం కాదని అన్నారు. కేసీఆర్, కేటీఆర్‌లు పదే, పదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారు.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఒక బాధ్యత గల ప్రజా సేవకుడిగా చాలా సహనంతో వ్యవహరిస్తున్నారని చెప్పారు. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్‌కు సమాజంలో చాలా బాధ్యత ఉంది. అది వదిలేసి తిట్ల పురాణం ఎత్తుకున్నారు. హరీష్ రావుకు రాజకీయాలు తెలుసు.. కేటీఆర్ లాంటి అవగాహన లేని వారికి ఆయన చెప్పాలని సూచించారు. హరీష్ రావు కూడా ఈ మధ్య నోరు జరుతున్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారు. ఇప్పటికైనా అసెంబ్లీ సమావేశాల్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొని తన అనుభవాలతో రాష్ట్రంలో ప్రజలకు మరింత మేలు ఎలా చేయవచ్చో చెప్పాలి. సమస్యలపై చర్చించాలి. అంతేకాని నోటికి పని చెప్పడం ప్రజాస్వామ్యం కాదని మల్లు రవి అన్నారు.

## విజయవంతంగా 'TTA సేవా డేస్–2025' వేడుకలు



- తెలంగాణలో భారీ ఎత్తున టీటీఏ పలు సేవా కార్యక్రమాలు
- 2 వారాల పాటు పలు జిల్లాల్లో 'టీటీఏ సేవా డేస్ 2025'

**హైదరాబాద్:** తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (TTA) ఆధ్వర్యంలో డిసెంబర్ 8 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన "TTA సేవా డేస్ 2025" సేవా కార్యక్రమాలు ఘనంగా ముగిశాయి. ఆరోగ్యం, విద్య, మౌలిక వసతులు, అవసరమైన సామగ్రి పంపిణీ వంటి ఎన్నో రకాల సేవా కార్యక్రమాలు రెండు వారాల పాటు పలు జిల్లాల్లో నిర్వహించారు. హైదరాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, వరంగల్, ములుగు, రంగారెడ్డి, యాదాద్రి, మహబూబ్‌నగర్, సూర్యాపేట, నల్గొండ, మెదక్ సహా పలు జిల్లాల్లో వైద్య శిబిరాలు చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ లైబ్రరీలు, కంప్యూటర్ ల్యాబ్‌లు ప్రారంభించి, బెంచీలు, యూనిఫామ్‌లు, ఎగ్జామ్ ప్యాడ్‌లు, జ్యామెట్రీ బాక్సులు అందజేశారు. పాఠశాలల మరమ్మతులు, సీసీ కెమెరాల ఏర్పాటు, ఆలయాల పునర్నిర్మాణం కూడా చేపట్టారు. గచ్చిబౌలి స్టేడియంలో 10కే రన్‌ను కూడా నిర్వహించారు. వృద్ధుల కోసం రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన క్యారం బోర్డు ఛాంపియన్‌షిప్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ మహా సేవా కార్యక్రమాలను టీటీఏ (TTA) అధ్యక్షుడు నవీన్ రెడ్డి మల్లిపెద్ది నాయకత్వంలో టీటీఏ సేవా డేస్ కోఆర్డినేటర్ విశ్వ కంది, ఫౌండర్ డా. పైళ్ళ మల్లా రెడ్డి, అడ్వైజరీ కౌన్సిల్ చైర్ డా. విజయపాల్ రెడ్డి, కోచైర్ మోహన్ రెడ్డి పటలోళ్ల, అడ్వైజరీ సభ్యులు భరత్ రెడ్డి మాదడి, శ్రీని అనుగు, పూర్వ అధ్యక్షుడు వంశీరెడ్డి కంచరకుంట్ల, ఇండియా కోఆర్డినేటర్ డా. ద్వారకానాథ రెడ్డి, ఇండియా సేవా డేస్ కోఆర్డినేటర్ మధుకర్ రెడ్డి బీరాం, ఎగ్జిక్యూటివ్ కమిటీ, బోర్డు సభ్యుల మార్గదర్శకత్వం ఈ భారీ సేవా కార్యక్రమాలకు తోడ్పడింది. అమెరికా నుండి వచ్చి ఈ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న టీటీఏ టీమ్ సభ్యులకు, ఈ మహోన్నత కార్యక్రమాన్ని ప్రోత్సహించిన స్పాన్సర్‌లకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా టీటీఏ మహాసభలు "టీటీఏ మెగా కన్వెన్షన్ 2026" జూలై 17-19, 2026లో షార్లెట్, నార్త్‌కరోలైనాలో జరుగనున్నట్లు టీటీఏ నాయకులు వెల్లడించారు.

## 16 ఏళ్ళ లోపు వారికి సోషల్ మీడియా నిషేదం

### కేంద్ర ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టు సూచన

**మహా:** సోషల్ మీడియా వినియోగం చిన్నారుల మానసిక, శారీరక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం కీలక సూచనలు చేసింది. 16 ఏళ్ల లోపు వయసున్న పిల్లలకు సోషల్ మీడియా వినియోగాన్ని పూర్తిగా నిషేధించేలా చట్టం తీసుకురావడంపై కేంద్ర ప్రభుత్వం పరిశీలించాలని సిఫార్సు చేసింది. కాగా ఈ సూచనకు ఆస్ట్రేలియాలో అమలులో ఉన్న చట్ట నమూనాను ఆధారంగా చేసుకుని చేసింది. ఇందుకు గాను ఎస్. విజయ్ కుమార్ అనే వ్యక్తి దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) పై జస్టిస్ జి. జయచంద్రన్, జస్టిస్ కేకే రామకృష్ణన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇంటర్నెట్‌లో అశ్లీల చిత్రాలు, వీడియోలు, హింసాత్మక కంటెంట్ పిల్లలకు సులభంగా అందుబాటులోకి రావడం వల్ల వారి జీవితం, భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని పిటిషనర్ తన వాదన వినిపించారు. చిన్నారులు ఇలాంటి కంటెంట్‌ను చూడకుండా అడ్డుకునేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లు, నియంత్రణ వ్యవస్థలు అభివృద్ధి చేయాలని కోరారు. అయితే పిటిషనర్ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, అశ్లీల మరియు హానికరమైన కంటెంట్ పిల్లలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోందని వ్యాఖ్యానించింది. చిన్న వయసులోనే సోషల్ మీడియాకు అలవాటు పడటం వల్ల మానసిక ఒత్తిడి, దృష్టి లోపం, వ్యసన ప్రవర్తన, లైంగిక దోపిడీ ప్రమాదం, సైబర్ బుల్లీయింగ్ వంటి సమస్యలు తలెత్తుతున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. పిల్లల భద్రత దృష్ట్యా 16 ఏళ్ల లోపు పిల్లలను సోషల్ మీడియా నుంచి పూర్తిగా దూరం చేసే చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది.

# ఐపీఎల్ రికార్డు వీరుడికి దేశ అత్యున్నత గౌరవం

## రాష్ట్రపతి భవన్‌లో మెరిసిన యువ క్రికెటర్

### వైభవ్ సూర్యవంశీని వరించిన 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్'
### అతి చిన్న వయసులో బాల పురస్కారం అందుకున్న వైభవ్

**ఢిల్లీ, మహా:** భారత క్రికెట్ చరిత్రలో అత్యంత పిన్న వయసులోనే అసాధారణ రికార్డులను సృష్టిస్తున్న యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీని దేశ అత్యున్నత గౌరవం వరించింది. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన వర్ణరంజిత కార్యక్రమంలో, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా వైభవ్ ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్2025'ను అందుకున్నాడు. క్రీడారంగంలో అతను ప్రదర్శిస్తున్న అత్యుత్తమ ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఈ పురస్కారానికి అతడిని ఎంపిక చేసింది. కేవలం 13 ఏళ్ల వయసులోనే వైభవ్ సూర్యవంశీ క్రికెట్ ప్రపంచాన్ని తనవైపు తిప్పుకున్నాడు. 12 ఏళ్లకే రంజీ ట్రోఫీలో అరంగేట్రం చేసి, భారత దేశవాళీ క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. ఇటీవలే జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు వైభవ్‌ను రూ. 1.10 కోట్లకు కొనుగోలు చేసింది. దీనితో ఐపీఎల్ చరిత్రలోనే అమ్ముడైన అత్యంత చిన్న వయసున్న ఆటగాడిగా అతను సరికొత్త చరిత్ర సృష్టించాడు. గతంలో ఆస్ట్రేలియా అండర్19 జట్టుపై కేవలం 58 బంతుల్లోనే సెంచరీ బాదడం వైభవ్ అసాధారణ బ్యాటింగ్ నైపుణ్యానికి నిదర్శనం. పురస్కార గ్రహీతగా వైభవ్ పేరు ప్రకటించినప్పుడు సభలో హర్షధ్వానాలు మిన్నంటాయి. రాష్ట్రపతి చేతుల మీదుగా మెడల్ మరియు సర్టిఫికెట్ అందుకున్న వైభవ్, భారత క్రికెట్ భవిష్యత్తులో తాను ఒక ధ్రువతారగా ఎదగనున్నట్లు చాటిచెప్పాడు. ఈ అవార్డు ప్రదానోత్సవంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు పాల్గొని వైభవ్‌ను అభినందించారు. బిహార్‌లోని ఒక సామాన్య గ్రామం నుంచి వచ్చిన వైభవ్, తన పట్టుదలతో ఈ స్థాయికి చేరుకోవడం దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది యువ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తోంది.



# రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**లక్షెట్టిపేట,మహా:** రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు.శుక్రవారం లక్షెట్టిపేట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు సీఎం ,డిప్యూటీ సీఎం,మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు చిత్రపటాలకు పాలభిషేకం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలోని మోదేలలో మినీ లిఫ్ట్ ఇరిగేషన్ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మంజూరు చేపించడం చరిత్రలో నిలిచిపోతోందన్నారు.రైతుల ఎన్నో ఏండ్ల కలను నెరవేర్చిన ఘనత ఎమ్మెల్యేకే దక్కిందన్నారు.రైతులకు ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా న్యాయం చేసేది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనని వివరించారు.నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేల ప్రేమ్ సాగర్ రావు కృషి చేస్తున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబెర్ అంకతి శ్రీనివాస్,పట్టణ అధ్యక్షుడు ఎండి ఆరిఫ్,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం,డీసీసీ అధికార ప్రతినిధి పూర్ణచందర్ రావు, నాయకులు,వివిధ గ్రామాల సర్పంచులు,రైతులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.




మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శనివారం, తిరుపతి | 27-12-2025
ANN తెలుగు



# హీరోయిన్ మీనా కూతురిని చూశారా?

హీరోయిన్ మీనా గురించి తెలుగు ప్రేక్షకులకు కొత్తగా పరిచయం అక్కర్లేదు. అప్పట్లో చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్ తదితర హీరోలతో వరస సినిమాలు చేసి గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పటికీ లీడ్ రోల్స్, క్యారెక్టర్ ఆర్టిస్టుగా అడపాదడపా మూవీస్ చేస్తూనే ఉంది. ఈమె కూతురు కూడా ఐదేళ్లకే బాలనటిగా చేసింది. ప్రస్తుతం చదువుకుంటోంది. అయితే మీనా కూతురి లేటెస్ట్ ఫొటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. క్రిస్మస్ సందర్భంగా సెలబ్రిటీలు చాలామంది తమ ఇంట్లో సెలబ్రేషన్ ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేశారు. మీనా కూతురు నైనిక కూడా తల్లితో కలిసి దిగిన ఓ ఫొటోని ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. ఇది చూసిన చాలామంది అప్పుడే ఇంత పెద్దది అయిపోయిందా అని అనుకుంటున్నారు. ప్రస్తుతం నైనిక వయసు 14 ఏళ్లు. ఐదేళ్ల వయసున్నప్పుడు దళపతి విజయ్ 'తెరి' (తెలుగులో పోలీసోడు) మూవీలో బాలనటిగా చేసింది. తర్వాత మరేం మూవీస్ చేయలేదు. ఇప్పుడు మాత్రం హీరోయిన్లకు పోటీ ఇచ్చేంత అందంగా ఉందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మీనా విషయానికొస్తే.. 1982లో 'నెంజంగళ్' సినిమాతో చైల్డ్ ఆర్టిస్టుగా కెరీర్ మొదలుపెట్టింది. తమిళ దిగ్గజ హీరో శివాజీ గణేశన్ చిత్రాల్లో ఎక్కువగా కనిపించేది. 1990లో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. తెలుగులో అప్పటి స్టార్ హీరోలతో కలిసి పనిచేసింది. చంటి, అల్లరిపిల్ల, అల్లరి మొగుడు, సుందరకాండ, ప్రెసిడెంట్ గారి పెళ్లాం తదితర మూవీస్‌తో ఫేమ్ సొంతం చేసుకుంది. ముఖ్యంగా వెంకటేశ్‌తో చాలా సినిమాలు చేసింది.




# విజయ్ పాడిన క్యూట్ సాంగ్ విన్నారా?

తమిళ హీరో దళపతి విజయ్ చివరి సినిమా 'జన నాయగణ్'. సంక్రాంతి కానుకగా జనవరి 9న తెలుగు, తమిళంలో రిలీజ్ అవుతోంది. ఇప్పటికే రెండు పాటలు రాగా తాజాగా మూడో పాటని విడుదల చేశారు. 'చెల్ల మగళే' అంటూ సాగే ఈ క్యూట్ గీతాన్ని విజయ్ పాడటం విశేషం. 'దళపతి కచేరీ' అంటూ సాగిన తొలి పాటలోని ఓ పోర్షన్‌ని విజయ్ గాత్రమందించాడు. ఈ పాట మాత్రం మొత్తంగా విజయ్ ఆలపించాడు.


ఈ సినిమా.. తెలుగులో హిట్ అయిన 'భగవంత్ కేసరి'కి రీమేక్ అని చాన్నాళ్లుగా ప్రచారం సాగుతోంది. ఈ పాట చూస్తే అదే అనిపించింది. ఒరిజినల్ మూవీలోనూ హీరో బాలకృష్ణ-పాప శ్రీలీల మధ్య ఓ సాంగ్ ఉంటుంది. అది ఇది ఒకటేలా అనిపిస్తున్నాయి. తెలుగులోనూ ఈ మూవీ 'జన నాయకుడు' పేరుతో విడుదల చేస్తున్నారు.

విజయ్.. తనకు ఇది చివరి సినిమా అని చాన్నాళ్ల క్రితమే ప్రకటించాడు. వచ్చే ఏడాది వేసవిలో జరగబోయే తమిళనాడు ఎన్నికల్లో ఇతడి పార్టీ పోటీపడనుంది. అందులో విజయ్ ఏ మేరకు విజయాన్ని అందుకుంటాడో చూడాలి? ఈ మూవీలో విజయ్ సరసన పూజా హెగ్డే నటించింది. మమిత బైజు కూడా కీలక పాత్ర చేసింది. హెచ్. వినోద్ దర్శకుడు. అనిరుధ్ సంగీతమందించాడు.



# రాముడు, వానర సైన్యం సీన్స్.. ట్రైలర్ రిలీజ్

అవినాష్ హీరోగా పరిచయమవుతూ దర్శకత్వం వహించిన సినిమా 'వానర'. నిన్నటివరకు ఈ పేరుతోనే ప్రచారం చేశారు. ఇప్పుడు టైటిల్ మార్చినట్లు ప్రకటించారు. 'వనవీర' అనే పేరుని ఫిక్స్ చేశారు. జనవరి 1న థియేటర్లలోకి రాబోతున్న ఈ చిత్ర ట్రైలర్ ఇప్పుడు విడుదల చేశారు. కులం, రాజకీయ అంశాలతో తీసిన ఈ సినిమాలో డివోషనల్ టచ్ కూడా ఉంది. ఈ మేరకు ట్రైలర్‌లో రాముడు, వానర సైన్యం, లంకకు వారధి కట్టడం లాంటి గ్రాఫిక్ విజువల్స్ చూపించారు. అయితే స్టోరీకి రాముడు, వానర సైన్యానికి లింక్ చేసి ఎలా చూపిస్తారో? ఇందులో సిమ్రాన్ చౌదరి హీరోయిన్‌గా చేయగా.. వివేక్ సాగర్ సంగీతమందించాడు.



# రజనీకాంత్‌తో సినిమా.. అన్నీ సైడ్ క్యారెక్టర్లే వచ్చాయి!

మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్ 'ది రాజాసాబ్' సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇవ్వనుంది. చిరంజీవి సినిమాలోనూ యాక్ట్ చేస్తున్నట్లు రూమర్స్ రాగా.. అందులో ఏమాత్రం నిజం లేదని కొట్టిపారేసింది. అయితే 'పేట' సినిమా తర్వాత తనకు సైడ్ రోల్స్ మాత్రమే సెట్ అవుతాయని కొందరు అన్నారంటోంది.

**అదేం అక్కర్లేదు**

ఈ విషయం గురించి తాజాగా మాళవిక మోహనన్ మాట్లాడుతూ.. నటీనటులకు పర్ఫెక్ట్ లాంచ్ అవసరం అని నేను అనుకునేదాన్ని. ఉదాహరణకు దీపికా పదుకొణె ఓం శాంతి ఓంతో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. నేను కూడా అలాగే ఓ పెద్ద సినిమాతో గ్రాండ్‌గా ఎంట్రీ ఇవ్వాలనుకున్నాను. నేనే కాదు, చాలామంది యంగ్ యాక్టర్స్ ఇలాగే ఫీల్ అవుతారు.

**ఏదైనా ప్రేక్షకుల చేతిలోనే..**

కానీ పర్ఫెక్ట్ సినిమా అంటూ ఏదీ ఉండదని అర్థమైంది. స్టార్ హీరోల సినిమా అయినా, గొప్ప దర్శకుల మూవీ అయినా రిజల్ట్ ప్రేక్షకుల చేతిలో ఉంటుందని తెలుసుకున్నాను. ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోతే ఎవరైనా బోల్తా కొట్టక తప్పదని అర్థమైంది. బియాండ్ ద క్లౌడ్స్ మూవీ చూసి దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ నాకు రజనీకాంత్ పేట మూవీలో ఆఫర్ ఇచ్చాడు.


**ఆ తర్వాత మొదలైంది**

అది హీరోయిన్ అవకాశం కానప్పటికీ రజనీకాంత్‌తో నటించే అదృష్టాన్ని వదిలేసుకోవాలనుకోలేదు. కానీ ఆ సినిమా చేశాక నాకు అన్నీ అలాంటి రోల్సే రావడం మొదలైంది. ఇకమీదట సైడ్ రోల్స్ మాత్రమే వస్తాయని కొందరు నిర్మాతలు అన్నారు. యాక్టర్స్‌ను ఇంత త్వరగా జడ్జ్ చేస్తారని అప్పుడే అర్థమైంది. ఒక పెద్ద సినిమా ఆఫర్ వచ్చినప్పటికీ కథ నచ్చకపోవడంతో రిజెక్ట్ చేశాను.

**ధైర్యంగా ముందుకు సాగాలి**

అంటే నేను మంచి రోల్స్ మాత్రమే చేస్తానని చెప్పకనే చెప్పాను. ఇక్కడ జనాలు మన మైండ్‌లో ఏవేవో ఎక్కించడానికి ప్రయత్నిస్తారు. కానీ, మనం ఎంతో ధైర్యంగా ముందుకు వెళ్లాల్సి ఉంటుంది అని మాళవిక చెప్పుకొచ్చింది. 'మాస్టర్' సినిమాతో హీరోయిన్‌గా మాళవిక మళ్లీ ఫేమ్‌లోకి వచ్చింది. తంగలాన్, హృదయపూర్వం సినిమాల్లో యాక్ట్ చేసింది. ప్రస్తుతం ప్రభాస్ సరసన 'ది రాజాసాబ్'తో పాటు తమిళంలో కార్తీతో 'సర్దార్ 2' చేస్తోంది.

# ధన్య, ఎస్తర్‌ల హారర్ మూవీ..



ప్రస్తుతం హారర్ సినిమాల హవా నడుస్తోంది. ఈ ఏడాది విడుదలైన అన్ని హారర్ సినిమాలు బాక్సాఫీస్ దగ్గర భారీ విజయం సాధించాయి. ప్రస్తుతం అదే తరహాలో ఉత్కంఠభరితమైన కథ, కథనంతో రూపొందిన చిత్రం అమరావతికి ఆహ్వానం. శివ కంఠంనేని, ధన్య బాలకృష్ణ, ఎస్తర్, సుప్రిత, హరీష్ ప్రధాన పాత్రల్లో నటించారు. సీనియర్ నటులు అశోక్ కుమార్, భద్రమ్, జెమిని సురేష్, నాగేంద్ర ప్రసాద్ కీలకపాత్రలు పోషించారు. డైరెక్టర్ జివికె ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ముప్పా వెంకయ్య చౌదరి గారి నిర్మాణ సారథ్యంలో జి. రాంబాబు యాదవ్ సమర్పణలో లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బేనర్‌పై కేఎస్ శంకర్‌రావు, ఆర్ వెంకటేశ్వర రావు నిర్మించారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, మధ్య ప్రదేశ్‌లోని పలు లొకేషన్స్‌లో షూటింగ్స్ జరుపుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. త్వరలోనే రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నారు. తాజాగా క్రిస్మస్ శుభాకాంక్షలతో పోస్టర్, గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా హీరో శివ కంఠంనేని మాట్లాడుతూ.. మా సినిమా టైటిల్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. అన్ని పాత్రలకి ప్రాధాన్యత ఉండేలా దర్శకుడు మంచి కథతో ఈ చిత్రాన్ని రూపొందించారు. ప్రస్తుతం వీఎఫ్ఎక్స్ వర్క్ జరుగుతున్నాయి అన్నారు. దర్శకుడు జివికె మాట్లాడుతూ.. ఈ మధ్య కాలంలో రిలీజైన అన్ని హారర్ సినిమాలు మంచి విజయం సాధించాయి. అదే తరహాలో మరో డిఫరెంట్ కథాశంతో వస్తోన్న చిత్రం అమరావతికి ఆహ్వానం. సీనియర్ సినిమాటోగ్రాఫర్ జె ప్రభాకర్ రెడ్డి గారి విజువల్స్, హనుమాన్ ఫేమ్ సాయిబాబు తలారి ఎడిటింగ్ ఈ సినిమాకు ప్లస్ అవుతాయి. పద్మనాబ్ బరద్వాజ్ గారి సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ థియేటర్స్‌లో ఆడియన్స్‌ని హారర్ మూడ్ క్యారీ చేసే విధంగా చేస్తుంది అన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com